
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 28 మార్చి 2024





కౌంటింగ్ కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు: ఎన్నికల నేపథ్యంలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక నెల్లూరు రూరల్ మండలం కనపర్తిపాడులోని ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ హరి నారాయణన్, జిల్లా ఎస్.పి కె. తిరుమలేశ్వర్ రెడ్డి, పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లు కౌంటింగ్ కేంద్రాల వద్ద చేయవలసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఎస్.పి కె. తిరుమలేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అదనపు ఎస్పీ సౌజన్య జిల్లా రెవిన్యూ అధికారి లవన్న, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల ఉన్నారు.



టిడిపితో మిత్రుల సమన్వయమేది..!

బిజెపి, జనసేన తలోదారి - ఎవరి ప్రచారం వారిదే ..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపిలో మిత్రభేధం కనిపిస్తోంది. బిజెపి, జనసేన రాష్ట్రవ్యాపితంగా కలిపి పోటీచేస్తున్నప్పటికీ జిల్లాలో ఆపార్టీలకు ఒక్క సీటు ఇవ్వలేదు. "మా కెందులే" అన్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపి నేతల మధ్యే సమన్వయ లోపం కనిపిస్తుండగా, మరోవైపు మిత్రుల తోనూ అంతంత మాత్రంగా ఉండడంతో ఆ పార్టీల్లో అయోమయం నెలకొంది. ఎంపితోపాటు, ఎంఎల్ఎ అభ్యర్థులు వారి వారి అజెండాలతో ముందుకు పోతు న్నారు. పోలింగ్‌కు సమయం ఎక్కువగా ఉండడంతో ఖర్చులు, నేతలు, కార్యకర్తలను సమన్వయం చేయడం ఎందుకనే ధోరణిలో ఆపార్టీలున్నాయి.

తెలుగుదేశం పార్టీలో సొంత పార్టీలోనూ, మిత్ర పక్షాలతోనూ సమన్వయలోపం కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాపితంగా పొత్తులో భాగంగా ఆ మూడు పార్టీలు కలిసినా ఇక్కడ ఉమ్మడిగా ప్రచారం నిర్వహించడం లేదు. జనసేన పార్టీ నేతలు ఇక్కడ నెల్లూరు, నెల్లూరు రూరల్ సీట్లపై దృష్టిపెట్టి తొలుత ప్రచారాలు చేసుకున్నారు. అభ్యర్థులు తామే అన్నట్లు వ్యవహరించారు. బిజెపి నేతలు ఒకటో, రెండో చోట్ల పోటీచేస్తామని చెప్పుకున్నారు. పొత్తుల్లో భాగంగా ఒక్క సీటు రెండు పార్టీలకు దక్కలేదు. జనసేన, బిజెపిలోనూ గ్రూపుల పోరుతో ఇబ్బందులు పడుతున్నారు. జనసేన పార్టీలో నాదెండ్ల మనోహర్, అజయ్ కుమార్ గ్రూపులున్నాయి., జిల్లా కమిటీల్లోనూ రెండు గ్రూపు చెలామణి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరికి ఒకరు పడడం లేదు. టిడిపి నేతలు ఒకరిని పిలిస్తే, మరొకరికి ఇబ్బందులుగా మారడంతో టిడిపి నేతలు వారి జోలికి వెళ్లడం లేదు. ఒకటో రెండు సమావేశాలు ఏర్పాటు చేసి మమ అనిపించారు. జనసేన నేతలను టిడిపి నేతలు ప్రచారానికి దూరంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. జనసమీకరణ, భోజనాలు, ఇతర ఖర్చులు పెరుగుతుండడంతో ఎవరికి వారే అన్నట్లు ఉంటున్నారు. జిల్లాలోని ఎక్కడా జనసేన నేతలు, టిడిపినేతలు కలిసి ప్రచారం చేయడం లేదు. బిజెపిలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మిత్ర పక్షాలతో సమన్వయ లోపంతో ఇబ్బందులు పడుతోన్న టిడిపి నేతలు, సొంత పార్టీలోనూ ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోని టిడిపి నేతల్లో అసంతృప్తి రగులుతోంది. కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు నగర నియోజకవర్గాల్లో టిడిపి నేతల్లో ఒకరికి ఒకరు పడడం లేదు. టిడిపి నేతలే కలిసి తిరగక పోవడంతో, మిత్ర పక్షాలను కలుపుకుపోవడం అంతం మాత్రంగానే ఉంది. జిల్లాలో నెలకొన్న సమన్వయ లోపాన్ని సర్దుబాటు చేయడానికి ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. 29న కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. రాత్రికి వింజ మూరులో బస చేసి, నేతల మధ్య సయోధ్య కుదర్చే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి, బిజెపి, జనసేన మిత్ర పక్షం ఏమేరకు పనిచేస్తుందో చూడాలి.



మిత్రపక్షాలు ఎవ్వరూ లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పి. నారాయణ



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం హరినారాయణన్

పెండింగ్ అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రంలో ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ అర్జీలను పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఎన్నికల్లో నగదు, మద్యం సీజ్ చేసిన వాటి వివరాలను ప్రతిరోజు నివేదికలు పంపాలన్నారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా జరుగుతున్న మద్యం, నగదు తనిఖీలను పెంచాలన్నారు. రాష్ట్రంలో ఎం.సి.సి. కు సంబంధించిన నివేదికను ప్రతిరోజు పంపాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించి సి విజిల్ యాప్ లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించుకునే సభలకు ర్యాలీలకు ముందస్తు అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు డోర్ టు డోర్ క్యాంపెయిన్లు నిర్వహించడానికి కూడా ముందస్తు అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నుండి కలెక్టర్ హరినారాయణన్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న ఉన్నారు.

వైసిపిది అసత్య ప్రచారం

సిపిఎం సీనియర్ నాయకులు పి.చంద్రారెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పి చంద్రారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు: గడిచిన 50 ఏళ్లుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తున్నాను, జీవితంలో చివర వరకు కమ్యూనిస్టుగానే కొన సాగుతానని సిపిఎం సీనియర్ నాయకులు పి. చంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ రామ చంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పి.చంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇతర రాజకీయ పార్టీల నాయకులపై చేసిన విధంగా తనపై అసత్య ప్రచారం, ఆరోపణలు చేయడం సరికాదని వైసిపి నాయకులకు హితవు పలికారు. మర్యాద పూర్వకంగా, వ్యక్తిగత పరిచయంతో విజయ్ సాయి రెడ్డి తన ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పడంతోనే తాను కలిశా నన్నారు. అంతే కాని తాను వైసీపీ విధానాలను బలపరుస్తానని వారితో చెప్పినట్టుగా నాపై చేసిన అసత్య ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు. 1970 నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పని పనిచేస్తున్నానన్నారు. చివరి వరకు కమ్యూనిస్టు గానే కొనసాగుతానని స్పష్టం చేశారు. తాను సిపిఎం రాజకీయ విధానానికే కట్టుబడి ఉంటానని, రానున్న ఎన్నికల్లో ఆదిశగా పయని స్తామన్నారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ, రాజ్యాంగానికి తీరని ద్రోహం చేసిన బిజెపిని, దానికి వంతపాడుతున్న స్వార్థపూరిత వైసిపి, టిడిపి, జనసేనలను ప్రజలు ఓడించాలని పిలుపు నిచ్చారు. వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ ఇతర లౌకిక పార్టీలతో " "ఇండియా ఫోరమ్"గా రానున్న ఎన్నికల్లో సిపిఎం ప్రజల ముందుకు వెళుతుందన్నారు. సిపిఎం నగర సీనియర్ నేత చంద్రారెడ్డి పై వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. రానున్న ఎన్నికల్లో అవకాశవాద రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వామపక్ష కూటమిని ఆదరించాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో సిపిఎం నగర అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ ఉన్నారు.

రేపు చంద్రబాబు 'ప్రజాగళం'..!

-కావలి, వింజమూరులలో బహిరంగ సభలు
-టిడిపి నేతలు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రేపు జిల్లాలో ప్రజాగళం పేరుతో ఎన్నికల శంఖరావాన్ని పూరించనున్నారు. రాష్ట్ర వ్యాపితంగా సాగుతోన్న యాత్రలో భాగంగా 27న నెల్లూరులో రోడ్‌షో నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడింది. 29వ తేదీ కావలి, వింజమూరు పట్టణాల్లో చంద్రబాబునాయుడు కార్యక్రమం నిర్వహించనున్నారు. 29 మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో కావలి చేరుకుంటారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో హెలిప్యాడ్‌లో దిగుతారు. ఎన్‌టిఆర్ సర్కిల్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. చంద్రబాబు నాయుడు కార్యక్రమ ఏర్పాట్లను ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పరిశీలించారు. భారీ బహిరంగ నిర్వహిం చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు పట్టణంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ,జిల్లా ఉమ్మడి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలిపించాలని కోరుతూ శంఖారావాన్ని పూరించి రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కంకణ బద్దుడై వస్తున్నారు. ఈ శంఖారావంతో వింజమూరు అధరాలి వైసిపి బెదరాలి టిడిపి గెలవాలని బీద రవిచంద్ర కోరారు. వింజమూరు మండల కేంద్రంలోని బొమ్మరాజు చెరువు సమీపంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ జెడ్‌పి ఛైర్మన్ చెంచల బాబుయాదవ్, రాబిన్ శర్మ టీంతో కలిసి వింజమూరు పట్టణంలోని, బంగ్లా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, పంచాయతీ బస్టాండ్, పాత బస్టాండ్ సెంటర్లను పరిశీలించారు. అన్నింటికీ అనువైన స్థలం పంచాయతీ బస్టాండ్‌గా నిర్ణయించి రోడ్ షో అనంతరం కాన్వాయ్ పై నుంచి అక్కడే సభ నిర్వహించేందుకు పెద్దలందరితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్ణయించారు. నారా చంద్రబాబు నాయుడు ల్యాండ్ అయ్యేందుకు హెలిప్యాడ్ స్థలాన్ని రాఘవేంద్ర ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో నిర్ణయించారు. ఆ స్థలాన్ని నాయకులందరూ పరిశీలించారు. 29వ తేదీ రాత్రి చంద్రబాబు నాయుడు వింజమూరులోనే బస చేయనున్నారు.



చంద్రబాబు బహిరంగ సభల ఏర్పాట్లపై నేతలతో చర్చిస్తున్న బీద రవిచంద్ర

ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని కలెక్టర్ హరినారాయణన్ సందర్శించారు. బుధ వారం ఆర్ అండ్ బి అతిథి గృహానికి వచ్చిన కలెక్టర్ ఆధునీకరించిన భవనాన్ని పరి శీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వస్తున్న ఎన్నికల పరిశీలకుల కోసం అతిథి గృహంలో అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఎ కలెక్టర్ వెంట డిఆర్‌ఓ లవన్న, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, డీఎస్‌ఓ వెంకటరమణ, ఈఈ మురళీకృష్ణ ఉన్నారు.



ముగిసిన శారదమ్మ అంత్యక్రియలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిపిఎం సీనియర్ నేత, నెల్లూరు జిల్లా మార్క్సిస్టు ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు జక్కా వెంకయ్య కుమార్తె కందల శారదమ్మ (63) అంత్యక్రియలు బుధవారం ఉదయం నెల్లూరు నగరంలో జరిగాయి. అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం వేకువజామున నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె జక్కా వెంకయ్య, పార్వతమ్మ దంపతులకు నాల్గవ సంతానంగా బుచ్చిరెడ్డిపాలెం మండలం, దామరమడుగు గ్రామంలో జన్మిం చారు. నెల్లూరు నగరంలోని ఏసి నగర్‌లోని వారి నివాసం నుంచి ఉదయం 10 గంటలకు అంతిమ యాత్ర సాగింది. 11 గంటలకు పెన్నా తీరంలోని బోడిగాడితోట వద్ద దహనసంస్కారాలు నిర్వహించారు. ఆమెకు ఒక్క కుమార్తె సౌమ్య లండన్‌లో ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో ఉండడంతో నెల్లూరు వచ్చారు. ఆమె భౌతికకాయానికి అల్లుడు విజయ్ దహనసంస్కారాలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, జొన్నలగడ్డ వెంకమరాజు, తుళ్లూరు గోపాల్, గోగుల శ్రీనివాస్, మూలె వెంగయ్య, సిపిఎం సీనియర్ నేత చంద్రరాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



శారదమ్మ భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు

పారదర్శక ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు :ఎన్నికల ప్రచారాల్లో రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయకుండా, ఎన్నికల నిబంధనలను పూర్తిగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రచారం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ విసి హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు పూర్తి చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి తప్పులు, కొట్టివేతలు లేకుండా అన్ని ఖాళీలను పూర్తిగా నింపాలన్నారు. ఫామ్ ఏ, ఫామ్ బి లలో ఇంకుతో మాత్రమే సంతకాలు చేసి ఉండాలని సూచించారు. అభ్యర్థులు భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ మేరకు తేదీలను రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలన్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఏప్రిల్ 25 నామినేషన్ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న నామినేషన్ల విత్ డ్రా ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నామినేషన్ తో పాటు అఫిడవిట్ ను అభ్యర్థులు ఫామ్ 26 ద్వారా ఇంకుతో సంతకం చేసి అందజేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ అభ్యర్థులు 2ఎ, అసెంబ్లీ అభ్యర్థులు 2బి నూతన ఫార్మాట్లో నామినేషన్ పత్రాలను అందజేయాలన్నారు. నామినేషన్ వేసే సమయంలో 100 మీటర్ల దూరం వరకే వాహనాలకు అనుమతి ఉంటుందని, ఆపై మూడు వాహనాలకు అనుమతి ఉంటుందని, ఆర్ వో చాంబర్లో అభ్యర్థితోపాటు మరో నలుగురికి ప్రవేశం ఉంటుందని చెప్పారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు ముందస్తుగానే సంబంధిత ఆర్వో వద్ద అనుమతి తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఒక ప్రపోజర్ ను, ఇతర అభ్యర్థులు పదిమంది ప్రపోజర్లను పొందు పరచాలన్నారు. అభ్యర్థులు ఒక ఎలక్షన్ ఏజెంట్ తో పాటు, మరొక అడిషనల్ ఏజెంట్ ను ఎక్స్పెండిచర్ వివరాల నమోదు కోసం నియమించుకోవచ్చని తెలిపారు. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం మూడు గంటల వరకు అఫిడవిట్లను ఆర్‌ఓకు అందజేయాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 20,41,258 మంది ఓటర్లు గా నమోదయి ఉన్నారని, వచ్చే నెల 15 వరకు ఫామ్ 6 ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ కొనసా గుతుందన్నారు. జిల్లాలో 6644 ఫామ్ 6 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. డిఆర్‌ఓ లవన్న, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైయస్సార్సీపి నుంచి జి నారాయణ, టిడిపి నుంచి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, రసూల్, బిజెపి నుంచి శ్రీనివాస్, మస్తానయ్య, బి.ఎస్.పి పార్టీ నుంచి శ్రీరామ్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -పొదలకూరు : పట్టణంలోని శివాలయంలో బుధవారం హుండీ ఆదా యాన్ని లెక్కించారు. ఆలయ ఇఒ కుడారి పెంచల వరప్రసాద్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. ఆలయ ఆవరణంలోని రామలింగేశ్వర స్వామి హుండీ తో పాటు కామాక్షి దేవి, విఘ్నేశ్వర స్వామి హుండీలను లెక్కించారు. లెక్కింపులో ఆలయానికి 75,750 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఆలయ అర్చకులు కుమార స్వామి, స్వచ్ఛంద కార్యకర్త చొప్పా వెంకటేశ్వర్లు ఉన్నారు.



ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి -పొదలకూరు : క్షణం తీరిక లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పరీక్షలు ముగియడంతో వారి మొహంలో ఆనందం కనిపించింది. వారు కబుర్లు చెప్పుకుంటూ వీడ్కోలు పలికారు. ఈనెల 18వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ముగిశాయి. పొదలకూరు మండలంలో 865 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను కేటాయించారు.

మొగళ్లూరులో ప్రచారం

ప్రజాశక్తి -పొదలకూరు : కరోనా కష్టకాలంలో సర్వేపల్లి నియోజకవర్గంలో రూ. 3 కోట్ల విలువైన బియ్యం, వంట నూనె ప్రజలకు పంపణీ చేసి వారిని అన్ని విధాలా ఆదుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలం మొగళ్లూరులో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజ కవర్గాల్లో ఏ నియోజ కవర్గం చేపట్టని విధంగా సర్వేపల్లి నియోజ కవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుర్తు చేశారు. మండల ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు జి. గోపాల్ రెడ్డి , చంద్రశేఖర్ రెడ్డి, కె .చిన్న బ్రహ్మయ్య, శ్రీనివాసులురెడ్డి, ఎం. శేఖర్ ఉన్నారు.



'పది' విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి -పొదలకూరు : పట్టణంలోని నాగార్జున స్కూల్లో బుధవారం సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నేటితో పదో తరగతి పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో పాఠశాల ఆవరణలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పి నట్లు విద్యార్థులు అందరూ కలలు కనాలని.. వాటిని సాకారం చేసుకునే దిశగా పట్టుదలగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల అడ్వైజర్ ఎన్ బాలు, ప్రిన్సిపల్ లక్ష్మీ దుర్గ, అకడమిక్ ఇన్‌ఛార్జులు అన్నం సుబ్బారావు, ఎ చంద్రశేఖర్, కష్ణ, ఉన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు : ఉలవపాడు మాజీ జడ్‌పిటిసి మల్లవరపు పద్మావతి భర్త మల్లవరపు సుబ్బారెడ్డి బుధవారం వైసిపికి రాజీనామా చేసి నెల్లూరు పార్లమెంట్ టిడిపి కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇం టూరి నాగేశ్వ రరావు, పార్ల మెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని తెలిపారు.



వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు : గుడ్ మార్నింగ్ స్కంధపురి అంటూ కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వైసిపి అభ్యర్థి బుర్రా మధు సూదన్ యాదవ్ పర్యటన చేశారు. బుధవారం ఉదయం టీ దుకాణాల వద్ద ఆయన పలువురిని పలకరిం చారు. ఈ సందర్భంగా టీ కొట్టు వద్ద వున్న ప్రజాశక్తి దినపత్రికను ఆసక్తిగా చదువుతూ ప్రజా పత్రిక ప్రజాశక్తి అని ప్రశంసించారు.



పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ హరి నారాయణన్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టర్ వారి చాంబర్లో ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులను రవాణా చేయడం గాని, నిల్వ చేయడం గాని చట్టరీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్లను రూపొందించారు. వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ దివ్య ప్రత్యూష పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మాలకొండ గ్రామంలో బుధవారం జరిగిన ముతకని వారి వివాహ వేడుకకు కందుకూరు వైకాపా అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులు మాధురి, బాలా జీలను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. చుండి సర్పంచ్ ఇరపని సతీష్, ఎంపిటిసి యానాది, మండల పార్టీ అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, ఇరపని సత్యనారాయణ, యాళ్ళ హరి బ్రహ్మ రెడ్డి, శివ కుమార్ రెడ్డి, కుంబాల క్రాంతి కుమార్, కుమ్మరి మాల్యాద్రి, కట్టా హనుమంతరావు, టెంకం కొండలరావు ఉన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-గుడ్లూరు :మండలంలోని తెట్టు దగ్గర గిరిజన కాలనీలో ఉన్న మామిడి తోటల్లో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు జూదరుల వద్ద రూ. 5 వేలు నగదు, నాలుగు సెల్ ఫోన్లు 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారిని కందుకూరు కోర్టులో కందుకూరు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

పసిప్రాయంలో పెద్ద కష్టం..!

-కాలేయ వ్యాధితో బాధపడుతున్న బాలుడు
-దాతల కోసం ఎదురుచూపు..!

ప్రజాశక్తి -పొదలకూరు

పసిప్రాయంలో కాలేయం దెబ్బ తినడంతో ఓ బాలుడు తల్లడిల్లి పోతున్నాడు. పూర్తిస్థాయి వైద్యం అందించలేని ఆర్థిక పరిస్థితుల్లో.. మరోవైపు మత్యువుతో పోరాడుతున్న కుమారుడిని చూసి ఆ తల్లిదండ్రులు ఏం చేయాలో అర్థం కాక కుమిలిపోతున్నారు. చిన్న కుటుంబం, చింతలు లేని కుటుంబం, ఇద్దరు పిల్లలతో తమకున్న దాంట్లోనే ఆనందంగా జీవితం గడుపుతున్నారు ఆ దంపతులు. అయితే ఆ తల్లిదండ్రులకు కొండంత కష్టం వచ్చింది. ఆడుతు పాడుతూ తిరుగుతున్న కుమారుడు అనారోగ్యం పాలయ్యాడు పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మస్తాన్, లక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్దమ్మాయి కూతురు కాగా రెండవ సంతానంగా కుమారుడైన విజయ మహీధర్ కాలేయ వ్యాధితో (ఇన్ఫాంటైల్ ట్రాన్సియెంట్ లివర్ ఫెయిల్యూర్) బాధప డుతున్నాడు. 11 ఏళ్ల వయసు ఉన్న ఈ బాలుడికి రెండు వారాల క్రితం పచ్చకామెర్లు వచ్చాయి. ఈ వ్యాధిని గమనిం చకపోవడంతో లివర్ 90 శాతం దెబ్బతింది. ఇది కాస్త బ్రెయిన్ కు పాకింది. లివర్ మార్పిడి చేయాలని డాక్టర్లు తెలిపారు. ఇందుకు సుమారు రూ. 40 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ప్రస్తుతం చెన్నైలో తాంబరం సమీపంలోని కంచి కామకోటి పిల్లల ట్రస్ట్ కు సంబంధించిన వైద్యశాలలో గత అయిదు రోజుల నుంచి వైద్య చికిత్స పొందుతున్నాడు. బాలుడి పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. బిడ్డ వైద్యం కోసం తల్లిదండ్రులు ఇప్పటికే తమ శక్తికి మించి అప్పు చేసి ఖర్చు చేశారు .వైద్యానికి రూ. 40 లక్షల రూపాయలు అవసరమని డాక్టర్లు చెప్ప డంతో రెక్కల కష్టం మీద ఆధారపడిన తల్లిదండ్రులు ఏం చేయాలో అర్థం కాక తల్లడిల్లుతున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు స్పందించి ఆదరించాలని కోరుతున్నారు. 9491452778.. 9494580880 నెంబర్లకు సంప్రదించి సాయం చేయాలని కోరుతున్నారు.



కాలేయ వ్యాధితో బాధపడుతున్న బాలుడు



'ఆర్ఎస్ఆర్'లో అథ్లెటిక్ మీట్

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 2324 ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మీట్‌కి ముఖ్య అతిథిగా జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పుట్టంరెడ్డి ప్రసాద్ రెడ్డి విచ్చేసి ప్రారంభించారని తెలిపారు. ముఖ్యఅతిథి మాట్లాడుతూ స్పోర్ట్స్, గేమ్స్ ప్రతి విద్యార్థిని విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించి, ఫిజికల్ ఫిట్‌నెస్ ధృఢంగా ఉంటుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, రోజంతా ఉల్లాసంగా ఉంటుందని విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేకంగా రన్నింగ్ రేస్, డిస్కస్ త్రో, షాట్ పుట్, త్రో బాల్, జావలిన్ త్రో వంటి క్రీడలను నిర్వహించారు. కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కూడా ఈ క్రీడలు సపరేట్‌గా నిర్వహించామని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ ఎ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా దినోత్సవం రోజు అందజేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపెంటలో వ్యక్తి దారుణ హత్య

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ప్రజాశక్తి-నెల్లూరు డెస్క్ : కావలి మండల పరిధిలోని తుమ్మలపెంట పంచాయతీ పరిధిలో పెద్ద రాముడుపాలెం గ్రామంలో వ్యక్తిని కాల్చి పూడ్చిన దారుణమైన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు బుధవారం కావలిరూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని కావలి రూరల్ ఎస్ఐ ఎస్.కె. రహమతుల్లాతో కలిసి డి.ఎస్.పి వెంకటరమణ పరిశీలించారు. అనంతరం కావలి రూరల్ సిఐ శ్రీనివాస రావు, తహశీల్దారు కె.గనేష్, విఆర్ఒ లు ఎస్.హరిబాబు, నారాయణతో కలిసి మృత దేహం ఉన్న సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహశీల్దారు కె.గనేష్ సమక్షంలో కాల్చబడి కుళ్ళిపోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ శ్రీనివాసరావుగౌడ్ వివరాలను వెల్లడించారు. మండల పరిధి లోని తుమ్మలపెంట పంచాయతీ పెద్ద రాముడు పాలెం గ్రామంలో 19వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో ఆ గ్రామానికి చెందిన కటంగారి చిన్నగోపాల్ (28) పెళ్లయ్యి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. చిన్నగోపాల్ తన మిత్రులతో కలిసి బయటకు వెళ్లాడు, కానీ తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య, తల్లిదండ్రులు ఆ గ్రామంలో వెతికి కనపడకపోయే సరికి చేపల వేటకు వెళ్లాడేమో అని అనుకున్నారు. కానీ మంగళవారం సాయంత్రం ఆ గ్రామానికి చెందిన యగ్గర్ అనే వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వాళ్ల ఇంటి పక్కన పూడ్చిన ఆనవాళ్ళు కనపడటంతో గోవింద్ అనే వ్యక్తి ఆటుగా వెళ్లడంతో యగ్గర్ తల్లి తమ ఇంటి దగ్గరకు రావద్దు అని చెప్పిందన్నారు. దాంతో వాళ్ల అనుమానం ఇంకా బలపడి గ్రామస్తులు వెళ్లి చూస్తే ఇంటి పక్కన ఒక మృతదేహాన్ని పూడ్చి పైన కట్టెలు కప్పబడి చెడువాసన వస్తుండడంతో గుర్తించిన మృతుడి భార్య, తల్లిదండ్రులు, గ్రామస్తులు దానిపై కావలి రూరల్ పోలీస్ స్టేషన్ కంప్లైంట్ ఇవ్వడంతో రూరల్ సిఐ శ్రీనివాసరావు, తహశీల్దారు కె.గనేష్ ఆధ్వర్యంలో కాల్చబడి కుళ్ళిపోయి ఉన్న మృత దేహాన్ని బుధవారం వెలికి తీశారని కావలి గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ నుండి వచ్చిన ప్రత్యేక డాక్టర్ల బృందం తహశీల్దారు సమక్షంలో స్పాట్ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మృతదేహం తప్పిపోయిన కటంగారి చిన్నగోపాల్‌దే అని గ్రామస్తులు, మృతుడి తల్లిదండ్రులు భావిస్తున్నారు, దానికి సంబంధించిన పూర్తి వివరాలు మృతదేహం పరీక్ష అనంతరం మెడికల్ ఆఫీసర్ ఇచ్చే రిపోర్ట్‌ను బట్టి అదే విధంగా డిఎన్ఎ రిపోర్ట్‌ను బట్టి గుర్తించాల్సి ఉంటుందని, ఈ కేసును దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు రూరల్ సిఐ శ్రీనివాసరావు గౌడ్ తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నగోపాల్ (ఫైల్)

పోస్టల్ బీమాపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో పారిశుద్య కార్మికులకు బుధవారం తపాలాశాఖలో నూతనంగా ప్రవేశ పెట్టిన బీమా సౌకర్యం గురించి కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పోస్టల్ ఎస్‌పిఓ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా బీమా (ఐపిపిబి), (జిఏజి) పాలసీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాల్సిన ఆవశ్యకత వివరించారు. నెల్లూరు ఐపిపిబి శాఖ అసిస్టెంట్ మేనేజర్ గిరీష్ మాట్లాడుతూ కేవలం సంవత్సరానికి రూ.1175తో రూ.15లక్షల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని ఆ పథకం వివరాలను అందరికి వివరించారు. కార్యక్రమంలో పారిశుద్య కార్మికులు, పోస్ట్‌మెన్‌లు పాల్గొన్నారు.


పారిశుద్య కార్మికులకు పోస్టల్ బీమాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'పది' విద్యార్థినికి అస్వస్థత

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని మానస తీవ్ర అస్వస్థతకు గురైంది. బుధవారం మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం నుండి బయటకు వస్తుండగా విద్యార్థిని ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంట ఉన్న విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.




ఆర్థికసాయం అందజేస్తున్న ప్రణీత్‌చౌదరి

రూ.10వేలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన పెంచలయ్య చిన్న పుల్లమ్మ దంపతుల కుమారుడి వివాహానికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ ఆది యాదవ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

స్థానిక 19వ వార్డులో పఠాన్ అమీర్‌ఖాన్ దంపతులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి అందరికీ మజ్జిగ, సుగంధ వాటర్, మంచి నీరు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎండాకాలం రోడ్డున వెళ్లే వారందరికీ మంచినీరు అందించాలని, వారి దాహార్తిని తీర్చాలని తల్లి ఆజిజునిస్సా పేరుపై చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ డాక్టర్ ఏగూరి చంద్రశేఖర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, రమేష్ రెడ్డి, నాపా కోటేశ్వరరావు, రఫీ, దావీదు, మస్తాన్ మణి, తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనలు నిర్వహిస్తున్న పసుపులేటి దంపతులు

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న పసుపులేటి సుధాకర్ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిం చారు. కావలి పట్టణంలోని కలుగోళ శాంభవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని ప్రజలను కోరుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి వద్ద పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదాన్ని సుధాకర్‌కు అందించారు. కావలి నియోజకవర్గంలోని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతామని పసుపులేటి సుధాకర్ తెలిపారు. రూ.150కోట్ల సొంత నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, తన మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే తాను చెప్పిన ప్రతి హామీని అత్యంత త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. అనతరం కావలి టౌన్లో బార్షం స్కూల్ నుంచి ప్రతి షాప్‌కు వెళ్లి, రాబోయే ఎన్నికలో తనకు ఓటేసి కావలి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మార్చి 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయని మండల విద్యాధికారులు ఎం.బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని సోమశిల, అనంతసాగరం, రేవూరు పదో తరగతి సెంటర్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని తెలిపారు. సోషల్ పరీక్షకు 400మంది పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఆర్‌టిసికి రూ.6.6 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-కావలి

కొండబిట్రగుంట తిరునాళ్ల సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపోకు రూ.6,57,597 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో సాధారణ ఛార్జీలతో 24 బస్సులు నడుపగా, గత సంవత్సరం కంటే రూ.58156 అధిక ఆదాయం వచ్చినట్లు ఆయన వెల్లడించారు. గత సంవత్సరం కిలోమీటర్‌కు 59.39 రూపాయల ఆదాయం రాగా, ఈ సంవత్సరం 67.54 రూపాయలు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అంకితభావంతో విధులు నిర్వహించిన ఆర్‌టిసి సిబ్బం దికి, కొండబిట్రగుంట శ్రీ ప్రసన్నవెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లకు, తమ బస్సు సర్వీసులను ఆదరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.


మాట్లాడుతున్న డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు



'మలిశెట్టి'కి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-కావలి : టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు తల్లి ఈశ్వరమ్మ మంగళవారం పరమపదించారు. బుధవారం వారి నివాసానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూటూరు కన్నబాబు, రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌లు, మలిశెట్టి ఈశ్వరమ్మ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం మలిశెట్టి వెంకటేశ్వర్లుని, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలో సోమల వెంకటేశ్వర్లురెడ్డి, నాగేశ్వరరావులకు చెందిన పొగాకు బ్యారెన్ బుధవారం అగ్నికి ఆహుతయింది. బ్యారెన్‌లో పొగాకు అల్లిన 1150 కర్రను క్యూరింగ్ కోసం ఉంచారు. క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు పొగాకు రాలి గొట్టం మీద పడడంతో మంటలు వ్యాపించి బ్యారన్ మొత్తం అగ్నికి ఆహుతయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4.50లక్షలు నష్టపోయామని రైతులు వాపోయారు. మర్రిపాడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు మంటలను అదుపు చేశారు.

బాధితులకు నష్టపరిహాం అందించాలి..

డిసిపల్లి పొగాకు బోర్డు అధికారులు అగ్నికి ఆహుతైన పొగాకు బేరం పరిశీలించి బాధితులకు నష్ట పరిహారం అందించాలని డిసిపల్లి పొగాకు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు మూలి వెంగయ్య బోర్డు అధికారులను కోరారు. ఆయన రైతులను విచారించగా దాదాపు రూ.4.50లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే అధికారులు స్పందించాలని కోరారు.


బ్యారెన్ మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


పూజలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి, మాజీ మంత్రి, వెంకటగిరి ఎంఎలఎ ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయాన్ని రవితేజ కళ్యాణ మండపంలో ఉదయం 8.30 గంటలకు ప్రారంభించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్ గౌస్‌బాషా, మీరా మొహిద్దీన్ (ఎన్ఆర్ఐ) మల్లికార్జున, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, చెరుకూరు పద్మావతమ్మ, తోడేటి వెంగటయ్య, శ్రీకాంత్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల పునరుద్ధరణపై స్పందన

ప్రజాశక్తి-బిట్రగుంట

విజయవాడ డివిజన్ రైల్వే పరిధిలోని బిట్రగుంటకు సంబంధించిన చెన్నయ్ - బిట్రగుంట, బిట్రగుంట -విజయవాడ మెమో రైళ్ల పునరుద్ధరణకు రైల్వే శాఖ స్పందించింది. ఏప్రిల్ ఒకటి నుండి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే శాఖ వారు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్‌కు మెయిల్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. బిట్రగుంట రైల్వే అభ్యర్థి కమిటీ అధ్యక్షులు షేక్.నూరుద్దీన్ మాట్లాడుతూ 23వ తేదీన విజయవాడ బిట్రగుంట చెన్నయ్ మెమోరైళ్లను కొనసాగించాలని బిట్రగుంట రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని రైల్వే బోర్డు కూడా మెయిల్ ద్వారా పంపడం జరిగిందన్నారు. స్పందించిన రైల్వేశాఖ బోర్డు విజయవాడ అధికారులకు ఈ రైళ్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుండి కొనసాగిస్తున్నట్లు తెలపడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. రైల్వే శాఖ స్పందించిన తీరుపై బిట్రగుంట అభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేశారు.


ప్రచారం నిర్వహిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

18వ వార్డులో ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

కావలి అసెంబ్లీ టిడిపి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి బుధవారం 18వ వార్డులో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 18వ వార్డు ఇన్‌ఛార్జి శానం హరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. యువత బాణా సంచాపేలుస్తూ సంబరాలు నిర్వహించారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఒక్క అవకాశం కల్పించి ఎంఎల్ఎగా తనను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని క్రిష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సంగం : మండలంలోని దువ్వూరు గ్రామంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. భారీగా వచ్చిన కార్యకర్తల నడుమ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ దువ్వూరు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. మండలంలో పది పంచాయతీలకు ఒక కళ్యాణ మండపం నిర్మిస్తామని తెలిపారు. పాస్టర్లకు పాస్టర్లకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రంలో జరిగిన సంక్షేమానికి పట్టం కట్టాలన్నారు. టిడిపి నాయకులు వలంటీర్లకు టెర్రరిస్ట్‌లు అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రావుల లక్ష్మి, దువ్వూరు సొసైటీ అధ్యక్షులు మధన్ మోహన్ రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి దేవసహాయం, నాయకులు శ్రీధర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేటలో..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : నిత్యం ప్రజల్లో ఉండి వారి కష్టసుఖాలు పంచుకునే వ్యక్తి ప్రసన్నకుమార్ రెడ్డి అని రాష్ట్ర డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో వైసిపి నేతలు కలిసి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి మేనిఫెస్టోను ప్రజలకు అందించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు వైసిపి ప్రభుత్వం వైపై ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అవలంబించారన్నారు. పేదవర్గాలు ఉన్నత స్థానాలకు ఎదగాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వమే రావాలన్నారు. కొందరు నాయకులు తమ స్వార్థానికి పార్టీని వీడి ప్రసన్న కుమార్ రెడ్డి పై అనుచితుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కోటీశ్వరులంతా టిడిపి వైపు ఉంటే పేద ప్రజలు తమ ప్రభుత్వం వైపు ఉన్నారన్నారు. కల్మషం లేని ప్రజా నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. ప్రసన్‌కుమార్ రెడ్డి మంచితనాన్ని ఆసరాగా తీసుకొని ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న కొందరు నాయకులు తమ నాయకుడిని మోసం చేసి ధనదాహంతో వేరే పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బివి రమణయ్య, ఎస్‌కె జలీల్, ముంగర వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి-ఉదయగిరి

వలంటీర్లపై చంద్ర బాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు అర్థరహితమని నియోజక వర్గం వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల దుత్తలూరులోని నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రతి పథకాలు ఇంటికి చేరుస్తూ ఆరోగ్యపరంగా ఎప్పటికప్పుడు ప్రజలకు సేవలు చేసి ప్రాణాలు కాపాడిన వలంటీర్లను విమర్శించడం సరికాదని దుయ్యబట్టారు. అవ్వాతాతలకు ప్రతి నెలా 1వ తేదీ పొద్దున్నే తలుపులు తట్టి గుడ్ మార్నింగ్ చెబుతూ చిరునవ్వులతో పించన్లు గడప వద్దకే చేస్తున్నందుకా లేక గతంలో మీ మాదిరి గా కాకుండా ప్రతి ప్రభుత్వం సంక్షేమ పథకాలు గడప వద్దకే చేస్తున్నందుకా వలంటీర్లను విమర్శించడం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

నాయీబ్రాహ్మణుల సమావేశం

ప్రజాశక్తి-కావలి

కావలి వాయునంద ప్రెస్‌వీధిలో నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. తిరుపతి తిరుమల దేవస్థాన పాలక మండలి సభ్యులు యాదయ్య, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కల్వకుర్తి ధనమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తదుపరి పలువురు నాయీ బ్రాహ్మణ నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. అనంతరం జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం" అనే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, నాయీబ్రాహ్మణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



'ప్రజాగళం' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కావలి

టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కావలి పట్టణంలోని ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద 29న నిర్వహించ తలపెట్టిన "ప్రజాగళం" బహిరంగ సభలో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు జెడ్‌పి హైస్కూల్‌లో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనువైన స్థలాన్ని కావ్య క్రిష్ణారెడ్డి, సుబ్బానాయుడులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక నాయకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

In the Court of the Honourable 7 th Additional District & Sessions Judge : Nellore

E.P.No.01/2024

O.S.No.22/2019

Between:
Devathi Bala Subrahmanyam - DHr/Plaintiff
Vs
1. Tupili Sarojanamma (Died) and 6 others - JDr's/ Defendants

Notice

To,
JDr7. K.Vijaya Lakshmi,
W/o **Krishna Murthy,** C/o Lalapet Santhi, D.No.13-646, Bheemaramudu Street, Chinna Bazaar, Nellore City.

పై నంబరు EP లో 7వ జడ్జిమెంట్ డెబ్టార్ అయిన K.Vijaya Lakshmi, W/o Krishnamurthy అను మీకు గౌరవ కోర్టు వారు పంపిన నోటీస్ తిరిగి వాపసు వచ్చినది. కావున గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ఇవ్వబడినది. కాబట్టి మీకు నోటీసు అందినట్లు బావించి **తే16-04-2024ది** న పై గౌరవ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా లేక మీ అనుమతి పొందిన వారు కానీ హాజరు పడి కౌంటర్ దాఖలు చేయవలసి ఉన్నది. అట్లు కాని ఎడల గౌరవ కోర్టు వారు మీ పరోక్షంలో తీర్మానించగలరు.

ఇట్లు
S.Ramesh Kumar
Advocate, Nellore.
Cell: **9052491003**

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జంపాని కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారం, ర్యాలీలు తదితర కార్యక్రమాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని సూచించారు. అంతేకా కుండా ఇతర పార్టీల వారిని కించపరిచి వారి మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం కూడా కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపారు. నేరుగానైన లేదా వివిధ ప్రసార మాధ్యమాలు లేదా సామాజిక మాధ్యమాల్లో వ్యవహరించి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రూ.50 వేలకు మించి నగదును రవాణా చేయకూడదని పేర్కొన్నారు. ఎక్కువ మొత్తంలో నగదును తీసుకెళ్తే తప్పనిసరిగా రశీదులు చూపించాలన్నారు. లేదంటే డబ్బులను సీజ్ చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

అర్చకుడిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న అర్చకులు

ప్రజాశక్తి-కావలి

పాలతో అభిషేకం సరిగా చేయలేదని కాకినాడలోని శివాలయంలో ఒక బ్రాహ్మణునిపై వైసిపి నాయకులు దాడి చేయడం అమానుషమని బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. వైసిపిని ఓడించడానికి బ్రాహ్మణులు కంకణం కట్టుకున్నారని బ్రాహ్మణసంఘం నేతలు తెలిపారు. బుధవారం కావలి టిడిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలతో అభిషేకం సరిగా చేయలేదని కాకినాడలోని శివాలయంలో ఒక బ్రాహ్మణునిపై వైసిపి నాయకులు దాడి చేశారని తెలిపారు. వైసిపికి బుద్ధి చెప్పడానికి, 2024 ఎన్నికల్లో టిడిపి గెలవడానికి రాష్ట్రంలోని ప్రతి గుడిలోనూ తమ బ్రాహ్మణులు పూజలు పునస్కారాలు నిర్వహిస్తారని వారు తెలిపారు. బ్రాహ్మణులపై చాలా ఇలాంటి దాడులు జరిగాయని, దానికి జగన్ ప్రభుత్వం ఓటమి మూల్యం చెల్లించుకుంటుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణుల ఐక్యతను కాపాడుకోవడానికి టిడిపి సహకారం అందిస్తుందని, కావున రాష్ట్రంలోని బ్రాహ్మణులందరూ ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసుకునే విధంగా టిడిపి అభ్యర్థులను గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిట్రగుంట శివ ప్రసాద్ కుమార్, తెలికేపల్లి శేషయ్య, టంగుటూరు ప్రకాష్ రావు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' ఏదీ నీ అభివృద్ధి..!

ప్రజా ధనాన్ని వృథా చేశావ్-ఎంఎల్‌సి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి పి.నారాయణ నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేశానని చెబుతున్నారని, ప్రణాళిక లేకుండా ప్రజాధనాన్ని వృథా చేశారని ఎంఎల్‌సి, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ నాలుగేళ్ల ప్రజలకు కనిపించకుండా ఎన్నికలు వస్తుండడంతో అబద్దాలు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నారాయణ ఆయన స్థాయి మరిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై విమర్శలు చేస్తున్నారన్నారు. నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ స్కీమ్‌ల కోసం హడ్కో నుంచి భారీగా నిధులు తీసుకొచ్చారన్నారు. ఒక్క అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలోనే రూ.49.5 కోట్లు అధిక టెండర్లు వేశారన్నారు. 90 శాతం హడ్కో నుంచి 11 శాతం వడ్డీతో తీసుకొచ్చారన్నారు. స్యూటర్ కోసం 8 శాతం, ఇంటికి 9 శాతం మాత్రమే వడ్డీకి



మాట్లాడుతున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

తీసుకుంటారని నారాయణ మాత్రం 11 శాతం వడ్డీకి తీసుకొని నెల్లూరు ప్రజల నెత్తిన భారం మోపారన్నారు. 10 శాతం నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు స్కీములకు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. 2016లో నిధులు వచ్చాయని, మూడేళ్ల కాలంలో ఈ స్కీములు పూర్తి చేయలేక పోయారన్నారు. నెల్లూరు నగరంలో 70 సంవత్సరాల క్రితమే భూ గర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఉందని, నారాయణ తెచ్చిందేమి లేదన్నారు. రూ. 830 కోట్లు హడ్కో నుంచి నిధులు తెచ్చారని, ప్రజలు అప్పులకు పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు. నగరంలో ఓ ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించలేదని, అందుకే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా చేశారన్నారు. ఇష్టప్రకారం పని చేయడంతో పైపులన్నీ పగిలిపో యాయని తెలిపారు. నెల్లూరు నగరంలో నారాయణ డ్రెయినేజీ వ్యవస్థ వాటర్ పైప్ లైన్లతో ఒక్క ఇంటికన్నా కనెక్షన్లు ఇచ్చారా...అని ప్రశ్నించారు. నగరంలో ఇది ఫెయిల్యూర్ ప్రాజెక్టు అని కాంట్రాక్టర్ల కోసం చేశారన్నారు. రోడ్లు కూడా అస్తవ్యస్తంగా నిర్మించారన్నారు. టిడిపి ప్రభుత్వం చేసిన అప్పులను తమ ప్రభుత్వంలో రూ.730 కోట్ల రూపాయల అప్పును హడ్కోకి చెల్లించామన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం రాగానే వెంటనే ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1100 కోట్ల నిధులతో నెల్లూరు సిటీలో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. . వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి హయాంలోనే నెల్లూరు జిల్లా అభివృద్ధి జరిగిందన్నారు. నారాయణ, చంద్రబాబు అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందన్నారు. రూ.3058 కోట్ల నిధులని వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నారాయణ అక్రమాలను నిత్యం ప్రజలకు తెలియజేస్తామన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు

పిండిమిల్లు వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సోమవరపు నాగూర్(48) బోయ మడుగుల బస్టాండ్ సెంటర్లో ఓ టిఫిన్ హోటల్ దుకాణం ఉంది. తినుబండారాలకు వాడే పిండి పదార్థాలను పిండి మిల్లులో వేసి సిఫువేస్తుండగా కరెంటు షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఇతను రేషన్ బియ్యం బండి ఎండిఎం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కావలి

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల పర్వం దేశానికి గర్వమని గ్రీన్‌హ్యాండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షురాలు వేమూరి గాయత్రి పేర్కొన్నారు. బుధవారం కావలి ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంగణంలోని కావలి అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌వద్ద గ్రీన్ హ్యాండ్స్ సభ్యులు పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లా డుతూ అనేక కోట్లమంది ఓటర్లు పాల్గొనే ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి సంఘీ భావంగా మొక్కలు నాటామన్నారు. ఈ అవకాశం తమకు కల్పించిన ఆర్‌డిఒ వికె శీనానాయక్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ హ్యాండ్స్ బాధ్యులు తాతా శైలజ, వేమూరి సువర్ణ, బొగ్గవరపు శ్రీలక్ష్మి, అనుమలశెట్టి కామాక్షి, పబ్బిశెట్టి రాజేశ్వరి, వి నిహాల్, టి నేహశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పద్మావతి, శేషమ్మ పాల్గొన్నారు.

సర్వేపల్లికి పూర్వవైభవం తీసుకొస్తా..

ప్రజాశక్తి-పొదలకూరు

వైకాపా నాయకుల అవినీతి, అక్రమాలతో వెనుకబడిన సర్వేపల్లి నియోజకవర్గానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప నగర్, శ్రీహరి కాలనీలో ఆయన కుమారుడు రాజగోపాల్ రెడ్డి, నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ప్రజల ఓట్లతో గెలిచిన కాకాణి హయాంలో అభివృద్ధి జరిగిందా? లేదా తన హయాంలో అభివృద్ధి జరిగిందో..తనతో చర్చకి రావడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. పొదలకూరుకు మంత్రి కాకాణి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. పొదలకూరు చుట్టు పక్కల బినామీలతో 300 ఎకరాలను భూమిని కొనుగోలు చేశారన్నారు. అనేక భూ కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. రాబోవు ఎన్నికల్లో ఆలోచించి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లికార్జున నాయుడు, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పులిపాటివెంకటరత్నం నాయుడు, మస్తాన్ బాషా, అక్కెంసుధాకర్ రెడ్డి, బక్కయ్య నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు చేరిక

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని వెంకన్న పాలెం గ్రామానికి చెందిన 32 కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు తేదీ సమీపిస్తున్న కొద్ది సర్వేపల్లి నియోజకవర్గంలో వైసిపి నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయన్నారు. సర్వేపల్లి ప్రగతి టీడీపీతోనే సాధ్యమనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని చెప్పారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దుర్మార్గాలకు, దౌర్జన్యాలకు విసిగిపోయిన ప్రజలు త్వరలో ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న పాలెం గ్రామానికి చెందిన 32 కుటుంబాలు వై.సి.పిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వెంకటాచలం : మండలంలోని కనుపూరు గ్రామానికి చెందిన వైసిపి నేత ఆదూరు బద్రీనాథ్ బుధవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ చేరారు. బద్రీనాథ్ తోపాటు వైసిపి వార్డ్ మెంబర్లు బొమ్మి చిన్నబయ్య, తిరువీధి రమేష్, చెరుకూరు మల్లికార్జునులతోపాటు 150 కుటుంబాలు టిడిపిలో చేరాయి. సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రజల స్పందన చూస్తుంటే 1994, 1999 ఎన్నికలకు మించిన మెజార్టీతో విజయం సాధించబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని చౌటపాలెం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత కుడితిపుడి పెంచలనాయుడు కూడా మాజీ మంత్రి సోమిరెడ్డి సమక్షంలో వైసిపిని వీడి టీడీపీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజా యాదవ్, కోదండయ్యనాయుడు, ధనుంజయ నాయుడు, రమేష్ నాయుడు, సాయి నాయుడు, అమర్నాథ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గం గొల్లకందుకూరు గ్రామంలో ఇంటింటికి కోటంరెడ్డి కుటుంబం 2వ విడత ప్రచారాన్ని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ కుమార్తెలు హైందవి, వైష్ణవిలు బుధవారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని, చంద్రబాబు నాయుడు ను, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నీ ,నెల్లూరు రూరల్ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థించారు.

రోడ్‌షో నిర్వహణకు ప్రణాళికలు

ప్రజాశక్తి-సీతారామపురం

మండల కేంద్రమైన సీతారామపురంలో గురువారం ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వహించే భారీ రోడ్‌షో, బహిరంగ సభకు జన సమీకరణపై నాయకుల చర్చించారు. రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్, సీతారామపురం బిట్-1 ఎంపిటిసి పిసి అల్లూరురాజు నిమగ్నమయ్యారు. అందులో భాగంగా బుధవారం ఆయన సీతారామపురం, నారాయణప్ప పేట, పండ్రంగి, కొట్టాలు, సీతారామపురం ఎస్సీ కాలనీ, తురకపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి విజయ సాయిరెడ్డి భారీ రోడ్ షో బహిరంగ సభను జయప్రదం చేసేలా తగు ప్రణాళికలను రూపొందించారు. విజయసా యిరెడ్డి రోడ్‌షో, బహిరంగ సభలో వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వైసిపి నాయకులు, ఆయా ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని బెడుసుపల్లె గ్రామంలో గురువారం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మండల వైసిపి కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి బుధవారం తెలిపారు. ఎన్నికల ప్రచారం సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందన్నారు. రంజాన్‌మాసం 5.30 గంటలకు మసీదులో జరుగు ప్రత్యేక ప్రార్థన ఇఫ్తార్ విందులో పాల్గొంటారని తెలియజేశారు.

పరీక్ష కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని సోమశిల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రంలో బుధవారం డిప్యూటీ తహశీల్దార్ గిరీష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోషల్ పరీక్షకు విద్యార్థులు ఎంతమంది హాజరయ్యారని చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట గ్రామ రెవెన్యూ అధికారి ఉదయగిరి ప్రభాకర్ ఉన్నారు.